డ్రైనేజీల ఏర్పాటుకు చర్యలు

భీమిలి జెడ్సీ బొడ్డేపల్లి రాము



మంగమారిపేటలో పర్యటిస్తున్న జెడ్సీ బొడ్డేపల్లి రాము, అధికారులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డులో ఇప్పటి వరకు ఏయే ప్రాంతాల్లో డ్రైనేజీలు లేవో గుర్తించి ఆ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని, ప్రతీ ప్రాంతంలో డ్రైనేజీలు ఏర్పాటు చేస్తామని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము పేర్కొన్నారు. జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట టాస్కోపార్క్ కాలనీలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పందనలో వస్తున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా వార్డులో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నామని తెలిపారు. ప్రతి ప్రాంతానికి ఇప్పటికే మంచినీటి సదుపాయం కల్పించామని, వీధి దీపాలు ఏర్పాటు చేశామని, ఇంకా ఎక్కడైనా అవసరం అనుకుంటే తక్షణమే లైట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. నిర్మాణాలు చేసేప్పుడు డ్రైనేజీలకు, వాటర్ పైప్‌లైన్లకు స్థలం విడిచిపెట్టాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మి నాయుడు, సచివాలయ సిబ్బంది గౌరి, అశ్విన్, అలేఖ్య, శానిటరీ సూపర్‌వైజర్లు అమోరు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మార్మోగిన నృసింహ నామం

కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో శ్రీ వరాహ నృసింహ నామం మార్మోగింది. గురువారం ఉదయం శ్రీ వరాహ నృసింహ యజ్ఞం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో గల శ్రీ రాధాకృష్ణులను, సుభద్ర, బలభద్ర, జగన్నాథ స్వాములను వివిధ వర్ణాల పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని పర్యవేక్షించారు.

ఉత్సాహంగా రంగుల పోటీలు



చిత్రపటాలకు రంగులు అద్దుతున్న చిన్నారులు

ఆనందపురం : మండలంలోని గంభీరంలో ఉన్న హరేకృష్ణ వైకుంఠ దేవాలయం నిర్మాణ ప్రదేశంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రంగుల పోటీల్లో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. 14 పాఠశాలల నుంచి మూడు, నాలుగు తరగతులకు చెందిన 390 మంది విద్యార్థులు హాజరయ్యారు. పాల్గొన్న ప్రతి విద్యార్థికి శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని అందజేయగా వారు రంగులతో అలంకరించారు. వీటిలో ఉత్తమమైనవి ఎంపిక చేసి బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

స్కూల్ కాంప్లెక్స్‌లతో మెరుగైన బోధన

పద్మనాభం: స్కూల్ కాంప్లెక్స్‌లతో ఉపాధ్యాయులు తమ బోధనా సామర్థ్యం పెంపొందించుకోవచ్చని పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎ.బాలామణి అన్నారు. పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెకులో పద్మనాభం, అనంతవరం, రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు గురువారం స్కూల్ కాంప్లెక్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలామణి మాట్లాడుతూ సమావేశాల్లో ఉపాధ్యాయులు బోధనా విధానాలపై చర్చించుకోవడం వల్ల విద్యార్థులకు సులభంగా పాఠాలు బోధించవచ్చన్నారు. ఫలితంగా వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దగలమన్నారు.

యువకుడు అదృశ్యం



నరేంద్ర

పద్మనాభం: పద్మనాభం గ్రామంలో ఒక యువకుడు అదృశ్యమైనట్టు సీఐ ఎన్.సన్యాసినాయుడు తెలిపారు. సీఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. పద్మనాభం గ్రామానికి చెందిన తాలాడ నరేంద్ర (24) ఈ నెల 24న ఉదయం ఎనిమిది గంటల సమయంలో శివాలయానికి వెళ్తున్నట్లు ఇంటిలో చెప్పి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ కనిపించలేదు. దీంతో నరేంద్ర తండ్రి అచ్చింనాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

పీఎం పాలెం: ఇంటర్ చదువుతున్న విద్యార్థిని అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమ్మాది జయంత్ నగర్‌కు చెందిన బాలిక (17) నగరంలోని ఓ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 28న ఉదయం 8 గంటలకు కళాశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. విద్యార్థిని స్నేహితులు, బంధువుల ఇళ్లలో వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పీఎం పాలెం: స్థానిక 11 కేవీ పీఎం పాలెం ఫీడర్ పరిధిలో లైన్ల నిర్వహణ, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విశాఖ ఆపరేషన్ జోన్ - 3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. హౌసింగ్ బోర్డు కాలనీ, వాకర్స్ పార్కు ఏరియా, అశోక్ నగర్, ఏక్సిస్ బ్యాంకు వెనుక ఏరియా, 46వ నంబరు సచివాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని తెలిపారు.

వరి సాగులో సస్యరక్షణతో మేలు



మజ్జివలసలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఏడీ విజయప్రసాద్

తగరపువలస: వరిసాగులో సస్యరక్షణతో మేలు జరుగుతుందని వ్యవసాయశాఖ భీమిలి ఏడీ బి.విజయప్రసాద్ అన్నారు. భీమిలి మండలం మజ్జివలసలో గురువారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. పొలం పరిసరాల విశ్లేషణ, మిత్ర పురుగుల సంరక్షణ, వరిపంటలో కలుపు నివారణ, ఊడ్చిన 3 రోజుల్లో ఎకరాకు 35 గ్రాముల ఆక్సాడియార్గిని ఇసుకలో కలిపి చల్లుకోవాలని సూచించారు. వ్యవసాయ డ్రోన్లు, నానో యూరియా ఉపయోగాలను వివరించారు. అలాగే వరి సాగు చేస్తున్న పొలాల గట్లు మీద బంతి లేదా కందులు వేయడం వల్ల ఎర పంటగా ఉపయోగపడతాయన్నారు. 100 శాతం రాయితీతో కంది విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో భీమిలి వ్యవసాయాధికారి బి.శివకోమలి, వీఏఏ బి.రమేష్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణాష్టమి వేడుకల కరపత్రాలు విడుదల



కృష్ణంరాజుపేటలో కరపత్రాలు విడుదల చేస్తున్న వెంకటప్పడు తదితరులు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు కూడలిలో ఈ నెల 6 నుంచి 16 వరకు జరగనున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలకు సంబంధించిన కరపత్రాలను జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు గురువారం విడుదల చేశారు. కార్యక్రమంలో శింగనబంద సర్పంచ్ గాడు వెంకటనారాయణ, త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారకర్త బోని రావణ అక్షయ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌హెచ్ కాలనీకి తీరనున్న నీటి సమస్య



పనులు ప్రారంభిస్తున్న వరలక్ష్మి

పీఎం పాలెం: ఇటీవల గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆర్‌హెచ్ కాలనీ వాసులు చేసిన విజ్ఞప్తికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు స్పందించారు. నూతన బోరు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నిధులు మంజూరు చేయగా వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షురాలు కె.వరలక్ష్మి గురువారం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. కోరిన అనతి కాలంలోనే బోరు మంజూరు చేయడం పట్ల కాలనీవాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కోరాడ రాజు, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

చిప్పాడలో శ్మశానవాటిక ప్రారంభం



శ్మశానవాటికను ప్రారంభిస్తున్న సర్పంచ్ రమావతి తదితరులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడలో దివీస్ లేబొరేటరీ రూ.32 లక్షలతో నిర్మించిన శ్మశానవాటికను స్థానిక సర్పంచ్ వెంపాడ రమావతి గురువారం ప్రారంభించారు. తమ పంచాయతీలో వసతుల లేమితో బాధపడుతున్న ప్రజలకు కొత్తగా శ్మశానవాటిక నిర్మించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంపాడ సూరిబాబు, రాజారెడ్డి, గ్రామ పెద్దలు చుక్క శివాజీ, సరగడ ఈశ్వరరావు, వార్డు సభ్యులు రామసూరి, బంగారప్పడు, దివీస్ సీఎస్‌ఆర్ ప్రతినిధి కె.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

హైవేపై ప్రమాదకర ప్రయాణాలు



డివైడర్ మధ్య నుంచి రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనదారులు

ఆనందపురం : జాతీయ రహదారికి ఆనుకొని గ్రామాలు ఉన్నా చేరుకోవడానికి మార్గం లేక చుట్టూ తిరిగి రావాల్సి రావడంతో వాహన చోదకులు రోడ్డుకు అడ్డంగా ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలంలోని గంభీరం పంచాయతీ కల్లివానిపాలెం గ్రామస్తులు తమ గ్రామానికి చేరుకోవడానికి చుట్టూ తిరిగి రావాల్సి ఉండడంతో జాతీయ రహదారికి మధ్యలో గల డివైడర్‌ని కొంత తొలగించి దారిగా మార్చి ప్రయాణిస్తున్నారు. దీంతో ఎంతో ప్రమాదకరంగా మారింది. భీమిలి క్రాస్ రోడ్డు నుంచి వచ్చే వారు నేరుగా గ్రామానికి చేరుకోవడానికి ఇబ్బంది లేదు. జాతీయ రహదారికి అవతల వైపు గ్రామ శివారున సచివాలయం ఉంది. దీంతో కల్లివానిపాలెం గ్రామస్తులు సచివాలయానికి చేరుకోవడానికి ఇబ్బందులు తలెత్తడం లేదు కానీ, సచివాలయానికి వెళ్లి తిరిగి వచ్చేవారు, బోయిపాలెంలో మార్కెట్ పనిమీద వెళ్లిన వారు, విశాఖ వైపు నుంచి వచ్చే వారు కల్లివానిపాలెం చేరుకోవాలంటే సుమారు అర కిలోమీటరు దూరం ప్రయాణించి భీమిలి క్రాస్ రోడ్డుకి చేరుకొని తిరిగి రావాల్సి ఉంటోంది. లేదా బోయిపాలెం జంక్షన్ నుంచి రాంగ్ రూట్లో ప్రయాణించి గ్రామానికి చేరుకోవాల్సి వస్తోంది. దీంతో చాలా మంది కల్లివానిపాలెం గ్రామం రోడ్డుకి ఎదురుగా జాతీయ రహదారిపై గల డివైడర్‌ని కొంత మేర తొలగించి రహదారిగా మార్చి ద్విచక్ర వాహనాలతో ప్రయాణిస్తున్నారు. దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకర ప్రయాణాలను నిరోధించాలని పలువురు కోరుతున్నారు.

బంగారమ్మకు ప్రత్యేక పూజలు



పూజలు అందుకున్న బంగారమ్మతల్లి

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో గల శ్రీ బంగారమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి శ్రావణ పౌర్ణమి, పండగ వార మహోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు పసుపు, కుంకుమ, గాజులు, పువ్వులు సమర్పించుకున్నారు.

ఘనంగా అనుపోత్సవాలు

తగరపువలస: భీమిలి మండలం మజ్జిపేట పంచాయతీ బంగారమ్మతల్లి అనుపోత్సవాలు గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. నేలవేషాలు, బాణసంచా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పల్సర్ బైక్ ఝాన్సీ బృందం నిర్వహించిన డ్యాన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, సర్పంచ్ మజ్జి సూరినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు మజ్జి శ్రీనివాసరావు దర్శించుకున్నారు.

ఆనందంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



ఎంపీపీ రాంబాబుకు రాఖీలు కడుతున్న సోదరీమణులు

మధురవాడ: అన్నా చెల్లెళ్ల ప్రేమానురాగాలు, అప్యాయతకు ప్రతీకైన రాఖీ పౌర్ణమిని మధురవాడలోని వివిధ ప్రాంతాల్లో ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అక్క, చెల్లెమ్మలు... తమ్ముళ్లు, అన్నలకు రాఖీ కట్టి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కలకాలం తమకు తోడుగా నిలవాలని కోరారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకులు పోతిన శ్రీనివాసరావు, పోతిన హనుమంతురావు, పిళ్లా సత్యనారాయణ, నాగోతి తాతారావు తదితరులకు మహిళా నాయకులు రాఖీలు కట్టారు. చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయం, సిద్ధేశ్వర పీఠం తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో రాఖీ పౌర్ణమి వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. సోదరులకు తమ సోదరీమణులు రాఖీలు కట్టి ఆత్మీయతను చాటుకున్నారు. మద్దిలో ఎంపీపీ కంటుబోతు రాంబాబుకు పలువురు రాఖీలు కట్టి రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

పెంచిన ధరలు తగ్గించాలని ఆందోళన



బైపాస్‌రోడ్డులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తగరపువలస: పెంచిన ధరలు తగ్గించాలని కోరుతూ భీమిలి డివిజన్ సీపీఎం నాయకులు బైపాస్ రోడ్డులో గురువారం ఆందోళన చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఆగస్టు 30 నుంచి ఈ నెల 4 వరకు జరపనున్న నిరసన కార్యక్రమాలలో భాగంగా మాట్లాడారు. విద్యుత్, వంట గ్యాస్, పెట్రోల్ ధరలు తగ్గించడంతోపాటు స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయొద్దని కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేసి రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. ఈ నెల 4న తహసీల్దార్ కార్యాలయాల వద్ద చేపట్టే ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు. ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు, నీలాతి రాము, జోగ వెంకటరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ: ప్రభుత్వాలు మోపుతున్న ధరల భారాలు వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మధురవాడ జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు అన్నారు. పెంచిన ధరలకు వ్యతిరేకంగా కొమ్మాది జంక్షన్, వికలాంగుల కాలనీ, శారదానగర్, మిథిలాపురి వుడా కాలనీ పరిసర ప్రాంతాల్లో గురువారం ఆయన ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, యువత నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఓట్లు దండుకోవడం కోసం బీజేపీ గ్యాస్ ధరలు తగ్గించిందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు కూడా తగ్గించాలని డిమాండ్ చేశారు. పి.రాజ్‌కుమార్, కిరణ్, నాగేశ్వరరావు, గణేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వైఖానస జయంతి



భీమిలి: వైఖానస జయంతి సందర్భంగా స్థానిక వైఖానస ఆశ్రమంలో స్వామికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు రొంపిచర్ల శింగరాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో ముగ్గురి అరెస్ట్

సింహాచలం: విద్యార్థి మెడలో ఉన్న వెండి చైన్‌ను అపహరించిన ఘటనలో ముగ్గురిని పెందుర్తి క్రైం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పెందుర్తి ఎస్‌ఐ సల్మాన్‌బేగ్ తెలిపిన వివరాలిలా.. 94వ వార్డు కృష్ణరాయపురానికి చెందిన భార్గవ్ నరవలోని ఒక కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. గత నెల 28న సాయంత్రం ఇంటికి నడిచి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ముగ్గురు వ్యక్తులు వచ్చి విద్యార్థి మెడలో ఉన్న చైన్, సెల్‌ఫోన్ లాక్కుని వెళ్లిపోయారు. పెందుర్తి క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో... సీసీ కెమెరాల ఆధారంగా దొంగతనానికి పాల్పడిన ముగ్గురిని ఎస్‌ఐ సల్మాన్‌బేగ్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

2న నూతన కార్యాలయంలో పూజలు



నూతన కార్యాలయం పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు లా కాలేజీ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సెప్టెంబర్ 2న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా పూజలు చేసి నివాళులర్పిస్తామని రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్, జిల్లా అధ్యక్షులు కోలా గురువులు తెలిపారు. గురువారం నూతన కార్యాలయంలో పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి జిల్లాలో ఉన్న పార్లమెంట్ సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, సమన్వయకర్తలు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, జోనల్ ఇన్‌చార్జులు, వార్డు కార్పొరేటర్లు, పార్టీ జిల్లా నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

‘రిజిస్ట్రేషన్‌లో కొత్త పద్ధతి సరికాదు’



మధురవాడ సబ్ రిజిస్ట్రార్ మోహన్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

మధురవాడ: రిజిస్ట్రేషన్ విధానంలో కొత్త పద్ధతి ప్రవేశ పెట్టడం వల్ల దశాబ్దాలుగా ఈ వృత్తినే నమ్ముకుని ఉన్న తమ ఉపాధికి నష్టం వాటిల్లుతుందని, ఆ ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని మధురవాడకు చెందిన పలువురు డాక్యుమెంట్ రైటర్లు కోరారు. పెన్‌డౌన్‌లో భాగంగా గురువారం మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న కార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్ విధానం వల్ల ఫిజికల్ డాక్యుమెంట్స్ విధానం తొలగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల తాము ఉపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ మోహన్‌రావుకు వినతిపత్రం అందజేశారు.

వలందపేటలో రిక్వెస్ట్ స్టాప్ కోసం వినతి



వలందపేటలో రిక్వెస్ట్ స్టాప్ కోరుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు వలందపేట సర్వీస్ రోడ్డు వద్ద ఆర్టీసీ బస్సుల రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు కోరుతున్నారు. గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ బస్సులపై ప్రయాణాలు చేసేందుకు వలందపేట ప్రజలు తగరపువలస, సంగివలస వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. జాతీయ రహదారుల విస్తరణకు ముందు వలందపేటలోనే బస్సులు అన్నీ ఆగేవన్నారు. ప్రస్తుతం బస్సుల కోసం రెండు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ సమస్యను భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో శిల్లా వంశీరెడ్డి, చిల్ల సూర్యనారాయణరెడ్డి, కొసన శ్రీనివాసరెడ్డి, శీరపు నరసింగరావు, చిల్ల శంకర్‌రెడ్డి, చిల్ల సూరిదాసు, కొల్లి సత్యం, భవిరిశెట్టి కొండబాబు, సింహాద్రి, తుపాకుల శ్రీను పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం



భీమిలిలో సమావేశమైన ఏపీటీఎఫ్ ప్రతినిధులు

తగరపువలస: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ భీమిలి అర్బన్, రూరల్ నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం సాయంత్రం భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌లో జరిగింది. అధ్యక్షునిగా కరుభుక్త సన్యాసినాయుడు, ప్రధాన కార్యదర్శిగా చిప్పాడ మోహన్‌కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకునిగా పూర్వ కార్యదర్శి బి.వెంకటపతిరాజు, జిల్లా అధ్యక్షుడిగా కొటాన శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా తమలాల రామకృష్ణ వ్యవహరించారు.

పబ్లిక్ డిమాండ్

నివాసాల మధ్య తుప్పలు



పీఎం పాలెం షిప్‌యార్డు లే అవుట్ వద్ద నివాసాల చుట్టూ తుప్పలు



వాల్‌చంద్ నగర్‌లో వెలగని వీధిదీపాలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 6వ వార్డు పీఎం పాలెం చివరి బస్టాప్ సమీపంలోని ప్రజలు కొంతకాలంగా సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఇక్కడి వాల్‌చంద్ నగర్, షిప్‌యార్డు లే అవుట్‌లో కొన్ని నెలలుగా వీధిదీపాలు వెలగడం లేదు. దీంతో కుక్కలు, పందులు, విష పురుగుల సంచారం ఎక్కువగా ఉంది. దొంగల భయం కూడా పెరిగింది. సాయంత్రం 7 గంటల తర్వాత మహిళలు రాకపోకలు సాగించడానికి వెనుకాడుతున్నారు. ఈ కాలనీల చుట్టూ తుప్పలు పెరగడంతో భయంకరంగా ఉంటుంది. ఇటీవల సచివాలయం, విద్యుత్ సబ్‌స్టేషన్, మధురవాడ జోనల్ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేశాం. సమస్యలపై జీవీఎంసీ అధికారులు స్పందించి పరిష్కరించాలి.

– కడియం నీలిమ,
పీఎం పాలెం చివరి బస్టాప్

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలు

సింహాచలం: శ్రావణ పౌర్ణమి సందర్భంగా గురువారం సింహగిరి వరాహ లక్ష్మీనృసింహ స్వామికి ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేణ పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. విశేష హారతులు సమర్పించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

ఘనంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేణ పూజ, పుణ్యావావాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.